క్లుప్తంగా

క్షేత్రపాలకుని ఆలయంలో రుద్ర హోమం



రుద్ర హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర పాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం రుద్ర హోమం నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా అర్చకుడు శివ యాగశాల వద్ద గణపతి పూజ, పుణ్యహవాచనను నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణలతో రుద్రహోమాన్ని, ఆఖరిలో పూర్ణాహుతి వేడుకను నిర్వహించారు.

వృద్ధాశ్రమంలో అన్న సమారాధన



వృద్ధాశ్రమంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దాతలు

కొయ్యలగూడెం: స్థానిక రోటరీ క్లబ్ కల్పవృక్ష వృద్ధాశ్రమంలో సోమవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వేదభారత్ నేచురల్ ఫుడ్ ప్రొడక్ట్, గ్రీన్‌ల్యాండ్ క్యాపిటల్ సౌజన్యంతో ఒక రోజు అన్నదానం, పౌష్టికాహారాన్ని వృద్ధులకు అందించారు. సేవా సామాజిక కార్యక్రమాల్లో భాగంగా తమ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో వృద్ధ, అనాథ ఆశ్రమాలకు చేయూతనందిస్తున్నట్లు ఎండీ నిడదవోలు వినయ్‌రామ్ పేర్కొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు మాజేటి అప్పలరాజు, మాజేటి సత్యనారాయణ, దారం సత్తిరాజు, యతం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌టీఆర్ భూములకు పట్టాలివ్వాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

జంగారెడ్డిగూడెం: బుట్టాయగూడెం మండలం మర్రిగూడెంలో పలు సర్వే నంబర్లలో ఉన్న సుమారు 45 ఎకరాల ఎల్‌టీఆర్ భూములకు సంబంధించి సాగులో ఉన్న గిరిజనులకు సాగు పత్రాలు, పట్టాలు ఇవ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి ప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు ఎస్.సుందరం కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి, అనంతరం ఏవో శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మర్రిగూడెం గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీ, బుల్లితెర నటి సుహాసిని



శ్రీవారి ఆలయంలో నటి సుహాసిని

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయాన్ని ప్రముఖ సినీ, బుల్లితెర నటి సుహాసిని సోమవారం సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆమెతో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. సుహాసిని చంటిగాడు, సుందరానికి తొందరెక్కువ, గణ, ఆదివారం ఆడవాళ్లకు సెలవు వంటి హిట్ చిత్రాల్లో నటించారు. అలాగే ప్రస్తుతం మామగారు వంటి పలు సీరియల్స్‌లో నటిస్తున్నారు.

వైభవంగా విఘ్నేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దెందులూరు: మండలంలోని పెరుగుగూడెం గ్రామంలో దక్షిణాముఖ శ్రీ విఘ్నేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. శ్రీ పాటిమ్మ తల్లి ఆలయ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని అభిషేకాలు పూజలు ప్రదక్షణలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. విగ్రహ పున ప్రతిష్ఠ సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

పెళ్లి బాజాలకు వేళాయె!

- మన్యంలో గిరి పల్లెల్లో ఎటు చూసినా పెళ్లి సందడే
- మే, జూన్ నెలల్లో శుభ ముహూర్తాలు





పెళ్లి తంతు ప్రతీకాత్మక చిత్రాలు

బుట్టాయగూడెం: వివాహం జీవితంలో ఒక ఘట్టం. తమ పిల్లల వివాహాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని తల్లిదండ్రులు ఆరాట పడుతుంటారు. ఈ క్రమంలో వైశాఖ మాసం మే నెలలో మంచి ముహూర్తాలు ఉండడంతో పెళ్లి ఏర్పాట్లతో వధూవరుల కుటుంబాలు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. మే, జూన్ నెలల్లో మంచి ముహూర్తలు ఉండడంతో నూతన వస్త్రాలు, నగలు, కల్యాణ మండపాలు, సన్నాయి మేళాలు, కేటరింగ్, టిప్‌టాప్ సామాగ్రి, ఫొటో గ్రాఫర్లకు డిమాండ్ పెరిగింది.

గిరిజన గ్రామాల్లో పెళ్లిళ్ల సందడే సందడి

గ్రామాల్లో ఎక్కడ చూసినా పెళ్లిళ్ల సందడి కనిపిస్తుంది. పెళ్లిళ్లకు సంబంధించి ఇళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక పందిళ్లు, శుభ లేఖలు, కల్యాణ మండపాలకు అలంకరణ, నూతన వస్త్రాల కొనుగోళ్లతో షాపింగ్ మాల్స్ కిటకిటలాడుతున్నాయి. పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల్లో పెళ్లిళ్ల వాతావరణంతో కనిపిస్తుంది.

పెళ్లి వారిని ఆందోళన పెట్టిన అకాల వర్షం

ఆదివారం శుభకార్యాలకు మంచి ముహుర్తం ఉండడంతో అనేక మంది పెళ్లిళ్లతో పాటు పిల్లలకు నూతన వస్త్ర అలంకరణతో పాటు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమానికి కావాల్సిన డేకరేషన్లు చేసుకున్నారు. అంతా బాగానే ఉందనుకునే లోపు అకాల వర్షం శుభ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్న వారిని తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఒక్క సారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్ష కురిసింది. పలు గ్రామాల్లో శుభ కార్యక్రమానికి వేసుకున్న టిప్‌టాప్ టెంట్లు వర్షానికి తడిసి పడిపోయాయి. మారిన వాతావరణం చూసి ఆందోళన చెందుతున్న పెళ్లిళ్ల శుభ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్న వారిపై వరుణుడు శాంతించడంతో మధ్యాహ్నానికి మళ్లీ ఎండ రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వివాహ ముహూర్తాలు

మే నెలలో – 4, 8, 9, 10, 11, 14, 16, 18, 19, 21, 23, 24, 30 తేదీలు
జూన్ నెలలో – 2, 4, 5, 6, 7, 8 తేదీలు

రెండు నెలలు శుభ ముహూర్తాలు



మే, జూన్ రెండు నెలలు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఇప్పటికే నిశ్చయ తాంబూలాలు సిద్ధం చేసుకున్న వారు పెళ్లిళ్లు చేస్తున్నారు. మే నెలలో అత్యధికంగా శుభ ముహూర్తాలు ఉన్నాయి.

–అనిపెద్ది వెంకట రామకృష్ణశర్మ, పురోహితులు, బుట్టాయగూడెం

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న దాతలు

చింతలపూడి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొత్త బస్ స్టాండ్‌లో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. స్థానిక ఆయిల్ మిల్, రైస్‌మిల్ యజమానులు మాడా సత్యనారాయణ, మాడా శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ఎ.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జె.విశ్వేశ్వరరావు, ఎ.రాజారావు, కె.నాగ చిన్నారావు, ఎస్.కిరణ్, ఎం.సామ్యూల్, ఎన్.రాజా, బీవీఎస్ఎన్ రాజు, పి.గాంధీ, ఎం.సత్యేంద్ర కుమార్, టి.అప్పారావు, ఆర్టీసీ కంట్రోలర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలని ఎంపీకి వినతి



ఎంపీ సుధాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న చాంబర్ సభ్యులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం–కన్నాపురం రోడ్డులోని మిషనరీ హాస్పిటల్ ప్రాంతం వరకు డ్రెయినేజీ నిర్మించాలని చాంబర్ సభ్యులు, స్థానికులు ఏలూరు ఎంపీ సుధాకర్ యాదవ్‌కు వినతిపత్రం సమర్పించారు. పోలవరం ప్రాజెక్టు పర్యటనకు వెళుతున్న సందర్భంగా స్థానికులు ఆయన కాన్వాయ్ ఆపి డ్రెయినేజీ లేకపోవడం వలన ముంపు సమస్యను ఎదుర్కొంటున్నామని దీంతో వర్షా కాలంలో ఇళ్లు విడిచి బయటకు వెళ్లాల్సి వస్తుందని ఎంపీ వద్ద మొరపెట్టుకున్నారు. సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని స్థానికులకు ఎంపీ హామీ ఇచ్చారు.

రోడ్లను అభివృద్ధి చేయాలి

టి.నరసాపురం: అసంపూర్తిగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలని సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్‌బాషా కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సాయిబాబ, ఎంపీడీవో జి.మణికుమారిలకు ఆయన వినతిపత్రం అందజేశారు. నాసర్ పాషా మాట్లాడుతూ టి.నరసాపురం–బందంచర్ల రోడ్డు అంబేడ్కర్ సెంటర్ వద్ద రోడ్డుపై నీరు నిలిచిపోతుందన్నారు. అసంపూర్తిగా ఉన్న బందంచర్ల రోడ్డు పూర్తి చేయాలన్నారు. యూనియన్ బ్యాంకు వద్ద, టి.నరసాపురం–రావికంపాడు మెయిన్ రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా సీసీ రోడ్డు ఎత్తు పెంచాలని కోరారు.

సీహెచ్‌సీ ఆప్తమాలిక్ ఆఫీసర్‌గా దివ్య

దెందులూరు: మండలంలోని సీహెచ్‌సీ ఆప్తమాలిక్ (కంటి వైద్యం)ఆఫీసర్‌గా దివ్య నియమితులయ్యారు. సోమవారం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుందర్ కుమార్ మాట్లాడుతూ ఆప్తమాలిక్ ఆఫీసర్ దివ్య దెందులూరు సీహెచ్‌సీలో సోమ, మంగళ, బుధవారాల్లో విధులు నిర్వహిస్తారన్నారు.గురు, శుక్ర, శనివారాల్లో పోతునూరు పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తామని వివరించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



జంగారెడ్డిగూడెం:తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు



చింతలపూడి: డీటీకి మెమొరాండం అందజేస్తున్న ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వం అమలు చేయబోతున్న 9 రకాల పాఠశాలల వ్యవస్థ అసంబద్ధంగా ఉందని ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ నాయకులు, మండల అధ్యక్షుడు ఐవీ రత్నం అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బి.రెడ్డిదొర మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, కొయ్యలగూడెం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.వరకుమార్, వై.భద్రయ్య, సీనియర్ నాయకులు కె.నాగేశ్వరరావు, ఉమర్ ఆలీషా, ఐజాక్ కిషోర్, రామిరెడ్డి, బీపీ అబ్బులు, గోపి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నిరసన

చింతలపూడి: ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకత్వ పిలుపు మేరకు పాత తాలూకా కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న నూతన మార్పులకు వ్యతిరేకంగా ఉపాధ్యాయులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్, మధ్యంతర భృతి, సీపీఎస్ విధానం రద్దు, తదితర సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఏపీటీఎఫ్ చింతలపూడి, టి.నర్సాపురం, లింగపాలెం మండల శాఖ నాయకులు నిరసనలో పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ షకీలున్నీసాబేగానికి మెమోరాండం అందచేశారు. కార్యక్రమంలో మూడు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సీనియర్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షపు నీటిలో అంగన్‌వాడీ కేంద్రం



వర్షపు నీటితో నిండిన అంగన్‌వాడీ కేంద్రం గది

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లిలో పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని వర్షపు నీరు ముంచెత్తింది. ఆదివారం కురిసిన వర్షం కారణంగా కేంద్రంలోని గదిలోకి నీరు భారీగా చేరింది. దీంతో పిల్లలు, అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నీటితో నిండిన గదిలో కుర్చునే వీలు లేక పిల్లలను మరో చోట కూర్చోబెట్టాల్సి వచ్చింది. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటుందని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేయించడం గాని, లేదా మరో భవనంలోకి మార్చడం గాని చేయాలని కోరుతున్నారు.

క్షేత్రంలో అలరించిన కోలాట నృత్యాలు



అనివేటి మండపంలో కోలాట నృత్యాలు చేస్తున్న హరే శ్రీనివాస భజన బృందం సభ్యులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో పలు భజన మండలి సభ్యులు సోమవారం ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికపై కృష్ణాజిల్లా నందివాడ మండలం గోపాలపురానికి చెందిన వరసిద్ధి వినాయక కళా బృందం సభ్యులు, అలాగే అనివేటి మండపంలో తాడేపల్లిగూడెం మండలం కాగుపాడుకు చెందిన హరే శ్రీనివాస భజన బృందం సభ్యులు కోలాట నృత్యాలు ప్రదర్శించారు. చిన్నా, పెద్దా అంతా కలిసి అన్నమయ్య కీర్తనలు, గోవింద నామాలతో చేసిన ఈ నృత్యాలు చూపరులను అలరించాయి. కోలాట ప్రదర్శన అనంతరం వారంతా స్వామి, అమ్మవార్లను దర్శించారు.

ఆర్టీసీలో సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

జంగారెడ్డిగూడెం: ఏపీఎస్ ఆర్టీసీలో ఉన్న అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో సెక్రటరీ డీవీఎస్ఎన్‌టీ రాజు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ 5వ దశ ఆందోళనలో భాగంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కె.స్లీవజోజికి ఆర్టీసీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న 38 డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోవడంతో దశల వారీ నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లమని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డిపో అధ్యక్షుడు ఎస్.నరేంద్రకుమార్, డిపో సెక్రటరీ డీవీఎస్ఎన్‌టీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కొయ్యలగూడెం: పొంగుటూరులో ఏమెన్ ట్రస్ట్ సంస్థ ఆధ్వర్యాన ఏలూరు శంకర నేత్రాలయం సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శంకర నేత్రాలయ వైద్యులు డాక్టర్ రుతుజా, గుర్తించబడిన రోగులకు ఏలూరులో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు. పాస్టర్ చక్రవర్తి, టి.రమేష్, పిఎస్ జెరియాపాల్, కెఎస్ అశోక్, డివి చౌదరి, తారా, దివ్యజ్యోతి సహకరించారు.

శ్రీవారికి హంస వాహన సేవ



శ్రీవారికి హంస వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి 36వ నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్ఠా మహా కుంభాభిషేకాల్లో భాగంగా సోమవారం స్వామివారికి హంసవాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి ధన్వంతరీ హవనం, అనంతరం నిత్య పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి శాత్తుమురై నిర్వహించి తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీ వారికి హంసవాహన సేవ చేసి, నీరాజన మంత్రపుష్పాలు, శాత్తుమురై సమర్పించి తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పర్యవేక్షణలో యాజ్ఞిక బ్రహ్మలు జీఏవీ దీక్షిత్ స్వామి, కిళాంబి వేంకట పవన్ కృష్ణమాచార్యులు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యలను పరిష్కరించండి



రోడ్డు పక్కన డంప్ చేస్తున్న చెత్త



రహదారి పక్కన వేసిన చెత్త

టి.నరసాపురం: కృష్ణాపురం గ్రామంలోని చెత్త పోగులు, లీక్ అవుతున్న వాటర్ పైప్ లైన్లు, మురికి కాలువల సమస్యలను పరిష్కరించాలని బంజారా భజరంగీ భేరి సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ నాయక్, కమిటీ సభ్యుడు ధరావత్ శంకర్ నాయక్ లు కోరారు. ఈ మేరకు టి.నరసాపురం మండల ఎంపీడీవో మణి కుమారికి వారు వినతి పత్రం అందజేశారు. భూక్యా వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ గత సంవత్సర కాలం నుంచి గ్రామంలోకి చెత్తను సేకరించే ఆటో రావడం లేదని, దాని వలన ఎక్కడపడితే అక్కడ చెత్త పోగులు ఏర్పడి గ్రామమంతా దుర్వాసన వస్తుందన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీవోను కోరారు. దీనిపై ఎంపీడీవో మణికుమారి సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

చెత్త డంపింగ్‌ను నిలిపివేయాలి

మండలంలోని చింతలపూడి–టి.నరసాపురం ప్రధాన రహదారి గుర్రాజు కుంట వద్ద చెత్త డంపింగ్‌ను నిలిపివేయాలని సామాజిక కార్యకర్త ఎండీ నాసర్ పాషా కోరారు. చింతలపూడిలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. చింతలపూడి మున్సిపాలిటీ వారు సేకరించిన చెత్తను ప్రధాన రహదారి గుర్రాజు కుంట వద్ద డంపింగ్ చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని తెలిపారు.

పీజీఆర్ఎస్‌లో 12 అర్జీలు



పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న కార్యాలయ ఏవో

జంగారెడ్డిగూడెం: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ ఏవో శేఖర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సోమవారం మొత్తం 12 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. వాటిలో ఎస్.రామ్మోహన్ కోకో పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ముప్పిడి పున్నమ్మ తనకు రావాల్సిన కూలీ డబ్బులు రూ.60 వేలు ఇప్పించాలని కోరుతూ అర్జీ చేశారు. కొల్లూరి సుగుణ, మరికొందరు జంగారెడ్డిగూడెం పట్టణంలోని విక్టరీ ఫ్రైడ్ అపార్ట్‌మెంట్‌లో మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేసిన ప్లాట్ రిలీజ్ కాకుండానే జగన్నాథరాజు చట్టవ్యతిరేక రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని అర్జీ చేశారు. చాబత్తుల నిర్మల తనకు చెందిన ఎకరం భూమిని తన పేరున ఆన్‌లైన్ చేసి పాస్‌పుస్తకం ఇప్పించాలని, కట్టుమూరి లచ్చిరెడ్డి, మరికొందరు ఆర్అండ్ఆర్‌లో భూమికి భూమి ఇప్పించాలని, గుండెపల్లి సత్యవతి తనకు చెందిన భూమిని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని అర్జీని అందజేశారు. అలాగే సీపీఐఎంఎల్ తలారి ప్రకాష్‌మరికొందరు అల్లంచర్ల రాజుపాలెంలో రిజర్వ్‌ఫారెస్ట్‌ను నరికి అమ్ముకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, గోలిప్రసాద్ తనకు చెందిన టిప్పర్ లారీని ఒక వ్యక్తికి లీజుకు ఇచ్చానని, అయితే తనకు తెలియకుండా వేరొక వ్యక్తికి తన టిప్పర్ లారీని అమ్మివేశారని, తన లారీని తనకు అప్పగించాలని వినతిపత్రం అందజేశారు. బల్లే రాజు తనను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పూనెం పార్వతి, ఇతరులు మర్రిగూడెం గ్రామంలో సాగులో ఉన్న భూమికి పట్టాలు ఇప్పించాలని దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

భీమడోలు: దివ్యాంగులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఏలూరు ఎఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి అన్నారు. గుండుగొలనులోని విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో 66 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన దాతలు వెలివెల రాంబాబు, వెలివెల సాంబశివరావు, వెలివెల హరికృష్ణ దివ్యాంగులకు సన్న బియ్యం, పౌష్టికాహారాన్ని అందజేశారు. దివ్యాంగులకు పండ్లను పంపిణీ చేశారు. దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు సహాయ సహకారాలను అందించాలని కోరారు. దాతలను వారు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెద్దలు వగ్వాల శ్రీరామచంద్రమూర్తి, శివలంక రామకృష్ణ, మూడేడ్ల సింహాద్రి, కడగల లక్ష్మణరావు, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా

దెందులూరు: మండలంలో తెల్లరేషన్ కార్డు కలిగిన పశువుల పెంపకం దారులకు 50 శాతం రాయితీతో పోషకాలతో కూడిన దాణా అందజేస్తున్నట్లు దెందులూరు మండలం పశువైద్య శాఖ అధికారి రామ్మోహన్‌రావు అన్నారు. సోమవారం కొవ్వలి పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా రెండు పెద్ద పశువులు ఒక దూడకు 90 రోజులుగాను 450 కేజీల దాణాలు పంపిణీ చేస్తామన్నారు. పదకొండు వందల విలువైన 50 కేజీల బస్తాలు రూ.55లకే ఇస్తామన్నారు. పశుగ్రాసం కొరతను అధిగమించేందుకే ఈ చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో తెలుపు రేషన్ కార్డు కలిగిన పశువుల పెంపకందారులు 50 శాతం రాయితీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రామ్మోహనరావు తెలిపారు.